## క్లుప్తంగా

### విద్యార్థుల్లో సామాజిక జ్ఞానం పెంపొందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న గురుకులాల ప్రధాన కార్యదర్శి పావనమూర్తి

రేగిడి: విద్యార్థుల్లో సామాజిక జ్ఞానం పెంపొందించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల ప్రధాన కార్యదర్శి పావనమూర్తి సూచించారు. గురువారం మండలంలోని ఉంగరాడ మెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాన్ని సందర్శించిన ఆయన తరగతుల వారీ విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా వారి విద్యాసామర్థ్యాలను అంచనావేశారు. అనంతరం విద్యార్థుల వసతిగృహం సందర్శించి, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని, పాఠ్యాంశాల జ్ఞానంతో పాటు సామాజిక అంశాలపై కూడా విద్యార్థులకు జ్ఞానం అందించాలన్నారు. అలాగే పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను ఎలా సన్నద్ధం చేయాలో తెలిపారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజుపాల్గొన్నారు.

### స్వచ్ఛ సర్వేక్షణ్ క్యాలెండర్ ఆవిష్కరణ



స్వచ్ఛ సర్వేక్షణ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయులు

బాడంగి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్ క్యాలెండర్‌ను ఎంపీడీఓ ఆంజనేయులు సిబ్బందితో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ క్యాలెండర్‌లో పేర్కొన్న తేదీల వారీగా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, మండల రిసోర్స్ కో–ఆర్డినేటర్ పి.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

### 13 మద్యంసీసాల స్వాధీనం

రాజాం సిటీ: మండలంలోని పెనుబాక గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామని సీఐ కె.రవి కుమార్ తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు ఎస్‌ఐలు వై.రవికిరణ్, పి.నీలావతి సిబ్బందితో కలిసి గురువారం గ్రామానికి వెళ్లి, ఆకస్మిక దాడులు నిర్వహించారన్నారు. 13 మద్యంసీసాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించామన్నారు. నిందితులకు 14 రోజుల పాటు కోర్టు రిమాండ్ విధించిందన్నారు.

### ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ బొబ్బిలి మండల అధ్యక్షుడు వేణుగోపాలనాయుడు

రామభద్రపురం: మండలంలోని రావివలస పంచాయతీ, కొండగుడ్డివలస గ్రామానికి చెందిన అదారి బుజ్జిబాబు కొడుకు ఆనీస్ ప్రిన్స్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు వైద్య పరీక్షల నిమిత్తం రూ.10 వేలను ఆర్థికసాయంగా గురువారం అందజేశారు. ప్రిన్స్ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

### రింగ్‌రోడ్డు నిర్మాణానికి సహకరించండి

● విజయనగరం ఆర్‌డీఓ సూర్యకళ



రింగ్‌రోడ్డు నిర్మాణ మ్యాపు పరిశీలిస్తున్న ఆర్‌డీఓ సూర్యకళ

మెంటాడ: మండల కేంద్రంలోని హరిత రహదారిని ఆనుకుని చేస్తున్న రింగ్‌రోడ్డు కారిడార్ నిర్మాణానికి రైతులంతా సహకరించాలని విజయనగరం ఆర్‌డీఓ సూర్యకళ కోరారు. స్థానికంగా జరుగుతున్న రింగ్‌రోడ్డు నిర్మాణ ప్రాంతాన్ని హైవే అధికారులతో కలిసి గురువారం పరిశీలించిన ఆమెను స్థానిక రైతులు కలిసి, తమకు అదనంగా ఇస్తామన్న 30 శాతం పరిహారం చెల్లించాలని, అలాగే రింగ్‌రోడ్డు నిర్మాణంలో భాగంగా పొలాలకు వెళ్లేందుకు ప్రత్యేక మార్గాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న పాఠశాల భవనాలను తొలగించే ఏర్పాట్లు చేస్తున్నామని, అభివృద్ధి పనులకు ఎవరూ అడ్డం కాకూడదని తెలిపారు.

# 'జగనన్న సురక్ష'తో సత్వర సేవలు



వంగర: తలగాంలో అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



తెర్లాం: వెలగవలసలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి



సంతకవిటి: మండవకురిటిలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న అధికారులు



రాజాం సిటీ: కొండంపేటలో జరిగిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు



బొబ్బిలి: పెంట గ్రామంలో లబ్ధిదారుకు రైస్‌కార్డు అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మీవేణుగోపాల నాయుడు, జెడ్పీటీసీ శాంతకుమారి

గ్రామ గ్రామాన జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయి. ఓ వైపు ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, వారికి అవసరమైన ప్రభుత్వ సేవలు, పథకాలపై సర్వే చేస్తున్నారు. మరోవైపు ఈ సర్వే పూర్తయిన గ్రామాల్లో అర్జీదారులకు అవసరమైన జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండా అందజేస్తున్నారు. గురువారం పలు ప్రాంతాల్లో వీటిని అర్జీదారులకు అందజేయగా, గంటల వ్యవధిలోనే తాము అనుకున్న సేవలు అందుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. –బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్.

# పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు



కొండగుడ్డివలసలో వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

● 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని రావివలస సచివాలయం పరిధిలోని చందాపురం, చదిరెడువలస, గుమ్మిడివలస, కొండగుడ్డివలస, పంచమామిడివలస, ఆర్.చింతలవలస తదితర గిరిజన గ్రామాల్లో గురువారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఆయా ప్రాంతాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో రోడ్లు, డ్రైనేజీ వంటి పలు సమస్యలు పరిష్కరించాలని కోరగా, వాటిని పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పంచమామిడివలసలో విద్యుత్ బిల్లు రాయితీ రాకపోవడాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆ సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల వేళ మరోసారి తన మాయమాటలతో ప్రజలను మోసగించేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు సిద్ధమవుతున్నారని, ఆయన మాటలను నమ్మవద్దని ప్రజలకు హితవుపలికారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాల లేనిపోని విమర్శలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని, ఇది ఒక్క వైఎస్సార్ సీపీతో సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, బొబ్బిలి మండల పార్టీ అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, సర్పంచ్ కుమారి పాల్గొన్నారు.

# అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం



రాజాం సిటీ: అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న తహసీల్దార్ రాజు, తదితరులు



తెర్లాం: అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

రాజాం సిటీ: మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని తహసీల్దార్ ఎస్.కె.రాజు అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ కార్యాలయంలో కలాం వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి, ఘననివాళులర్పించారు. అనంతరం అబ్దుల్ కలాం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, బొత్స బుద్ధుడు, టి.శ్రీను, ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, దామెర రాజా తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి, మరికొంతమంది పాఠకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ప్రతీ విద్యార్థి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని, ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. భారత దేశం గర్వించదగ్గ వ్యక్తుల్లో ఆయన ఒకరని, ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వక్తలు కోరారు.

### గంగయ్యకు ఘననివాళి



గంగయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రసాదరావు తదితరులు

బొబ్బిలి: మండల కేంద్రంలోని పాతబస్టాండ్ వద్ద ఆరి గంగయ్య 37వ వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. బొబ్బిలి మున్సిపల్ తొలి చైర్మన్, ప్రథమ సర్పంచ్ అయిన గంగయ్య బొబ్బిలి ప్రాంత అభివృద్ధికి ఎంతగానో పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో తెలగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చనమల్ల ప్రసాదరావు, రమణమూర్తి, వెంకటరావు, మహేష్, నాని, అశోక్, ఆకుల దామోదరరావ పాల్గొన్నారు.

### పక్కాగా ఓటర్ల జాబితా

బాడంగి: పక్కాగా ఓటర్ల జాబితా తయారు చేయాలని తహసీల్దార్ అజురఫీజాన్ సూచించారు. గురువారం మండలంలోని లక్ష్మీపురం, తెంటువలస, పిన్నవలస పోలింగ్ కేంద్రాల పరిధిలోని జరుగుతున్న ఓటరు సర్వే, ఓటరు జాబితా తయారీని క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులంతా ఓటర్లుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, అలాగే మృతి చెందిన ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని బీఎల్‌ఓలకు సూచించారు.

రాజాం: మండలంలోని కొఠారిపురం, పొగిరి, గురవాం గ్రామాల్లో ఓటరు సర్వే గురువారం నిర్వహించారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి, ఓటరు వివరాలు సేకరించారు. అలాగే ఓటర్ల జాబితాలో సవరణలు చేపట్టారు. మృతి చెందిన ఓటర్లను జాబితా నుంచి తొలగించారు.

### పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

రేగిడి: పౌష్టికాహారంతోనే ఆరోగ్యమని, మనం రోజువారీ తినే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు తప్పకుండా ఉండేలా చూసుకోవాలని ఉండాలని వైద్యారోగ్య సిబ్బంది సూచించారు. గురువారం మండలంలోని బూరాడ, రేగిడి, ఉనుకూరు ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, ఏవైనా సమస్యలుంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

# యుద్ధప్రాతిపదికన గండి పూడ్చివేత పనులు

బొబ్బిలి:

మండలంలోని అలజంగి గ్రామం వద్ద ఉన్న తోటపల్లి కాలువ గండి పూడ్చివేత పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. కాలువకు గండిపడిన విషయం తెలుసుకున్న ఇరిగేషన్ శాఖ అధికారులు మట్టి, కంకర తెప్పించి, ప్రొక్లెయినర్ సహాయంతో గండిని పూడుస్తున్నారు. శుక్రవారం నాటికి పూర్తి స్థాయిలో పనులు పూర్తయ్యేలా శతవిధాలా ప్రయత్నిస్తున్నామని డీఈఈ డి.ఎస్.ఎస్.కుమార్ తెలిపారు.



తోటపల్లి కాలువ గండి పూడ్చివేత పనులకు తీసుకువచ్చిన ప్రొక్లెయినర్

# పండ్లతోటల పెంపకంతో రైతులకు ఉపాధి

రాజాం: పంట పొలాల్లో పండ్లతోటల పెంపకం ద్వారా రైతులు శాశ్వత ఉపాధి పొందవచ్చని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ సాయిరాం అన్నారు. గురువారం మండలంలోని గార్రాజుచీపురుపల్లి గ్రామంలో రైతులకు అందించిన జీడీమామిడి మొక్కలను పరిశీలించిన ఆయన డ్వామా శాఖ ఈ మొక్కల పెంపకానికి మూడేళ్ల పాటు రైతులకు వేతనాలు చెల్లిస్తుందన్నారు. అనంతరం వచ్చిన ఫలసాయాన్ని రైతులు నేరుగా మార్కెట్‌కు విక్రయించి, లబ్ధి పొందవచ్చన్నారు. ఉచితంగా అందజేస్తున్న ఈ పండ్ల తోటల మొక్కలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

బొబ్బిలి: నియోజకవర్గంలోని బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం మండలాల్లోని ఎరువుల దుకాణాల్లో తూనికలు, కొలతల శాఖల అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బరువు తక్కువ ఉండి, అధిక ధరలకు ఎరువుల బస్తాలు విక్రయిస్తున్న ఐదు షాపులపై కేసులు నమోదు చేసినట్లు ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ ఏబీ రామకృష్ణ తెలిపారు. నాణ్యమైన ఎరువులను నిబంధనల ప్రకారం విక్రయించాలని లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



తలతంపరలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

● 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం మండలంలోని తలతంపర గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రం, రాష్ట్రంలోని ప్రజలందరూ బాగుండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభిమతమని, దీనికోసం ఆయన ఓ వైపు అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తూనే మరోవైపు అన్ని వర్గాలకు మేలు జరిగేలా నిరంతరాయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలుచేయనన్ని పథకాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఆ పార్టీ కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ ఫలాలు అందేవన్నారు. ఇప్పుడు అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకు అమలైన పథకాల్లో ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. చంద్రబాబు అండ్ కో గత ఐదేళ్లు రాష్ట్రాన్ని దోచుకున్నారని, ఈసారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి డిపాజిట్లు కూడా దక్కవని జోస్యం చెప్పారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ మళ్లీ విజయఢంకా మోగించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహనరావు, ఎంపీటీసీ సభ్యుడు ఐ.మురళీకృష్ణ, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ సీహెచ్ వెంకటపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా...

### యాజమాన్య పద్ధతులపై అవగాహన

బాడంగి: మండలంలోని రేజేరు గ్రామంలో వ్యవసాయంలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై గురువారం అవగాహన కల్పించారు. వరినాట్లు వేసే ముందు వరికొనలు తుంచి వేయాలని, ఇలా చేయడం ద్వారా కాండంతొలుచు పురుగును నివారించవచ్చన్నారు. నారుకట్టలను సూడోమోనాస్ ద్రావణంలో పడేసి, శుద్ధి అయిన తర్వాత వాటిని నాటుకోవాలని వీఏఏ వి.సాయికుమార్ తెలిపారు.

### సర్వేను వేగవంతం చేయండి

రాజాం: మండలంలోని ప్రశస్త, ఓఎస్‌సీ(బడి బయట దివ్యాంగ పిల్లలు) సర్వేను వేగవంతం చేయండి అని బొబ్బిలి డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు ఎంఈఓలను ఆదేశించారు. గురువారం స్థానిక మండల రిసోర్స్ కార్యాలయానికి వచ్చిన ఆయన మండలంలో నిర్వహిస్తున్న ప్రశస్త సర్వేపై ఆరాతీశారు. బడిఈడు దివ్యాంగ పిల్లలంతా బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు ప్రవీణ్‌కుమార్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

### సేవలతోనే గుర్తింపు

వంగర: ఉద్యోగులు విధి నిర్వహణలో అందించిన సేవలతోనే వారికి తగిన గుర్తింపు వస్తుందని వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని కొప్పరవలస గ్రామ సచివాలయంలో మహిళా పోలీసుగా పనిచేసి, బదిలీపై వెళ్లిన యందవ అలివేలును గురువారం సన్మానించారు. ఇక్కడిలాగే చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.శ్రీరామ్మూర్తి, వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### సూక్ష్మసేద్యంతో అధిక దిగుబడులు

రామభద్రపురం: సూక్ష్మసేద్యంతో అధిక దిగబడులు సాధించవచ్చని ఏపీఎంఐపీ పీడీ పి.ఎన్. లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని జన్నివలస ఆర్‌బీకే పరిధిలోని అగ్గిన రమాదేవి, నంబూరి చంద్రశేఖర్ రైతులు వారి ఆయిల్ పామ్ సాగులో ఏర్పాటు చేసిన బిందుసేద్యం పరికరాలను గురువారం ఆయన పరిశీలించారు. బిందుసేద్యం, తుంపరసేద్యం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించేలా అన్నదాతకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న బిందుసేద్యం, తుంపరసేద్యం పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

రేగిడి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు అన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి, పలు మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ రమణ, ఫార్మాసిస్ట్ ఎం.గోవిందనాయుడు పాల్గొన్నారు.

# రుచి, శుచితో మధ్యాహ్న భోజనం

● పాఠశాలల సందర్శనలో విద్యాశాఖాధికారులు



సంతకవిటి: విద్యార్థులతో మాట్లాడుతున్న బొబ్బిలి డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు



రేగిడి: విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాలు పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు



తెర్లాం: వెలగవలస పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం అమలును పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీడీఓ రామకృష్ణ



రాజాం: విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రవీణ్‌కుమార్

సంతకవిటి: జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం రుచి, శుచి కలిగి ఉండాలని బొబ్బిలి డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు అన్నారు. మండలంలోని బొద్దూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన పాఠశాల రికార్డుల నిర్వహణ, విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, వారికి కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. నాణ్యమైన విద్య, భోజనం అందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని రేగిడి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు గురువారం సందర్శించి, జగనన్న గోరుముద్ద పథకం అమలును పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెట్టాలని, విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరితో రోజుకోసారి భోజనం చేయించి, భోజనం ఎలా ఉందన్న అభిప్రాయం సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని వెలగవలస జెడ్పీ ఉన్నత పాఠశాలను ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, మండల వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ గురువారం సందర్శించి, జగనన్న గోరుముద్ద పథకం అమలుపై ఆరాతీశారు. ప్రతిరోజూ వండే వంటకాలు మెనూ ప్రకారం ఉండాలని, తప్పనిసరిగా అవి రుచి, శుచి కలిగి ఉండాలని లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.

రాజాం: మండలంలోని పొగిరి గ్రామ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ ప్రవీణ్‌కుమార్ గురువారం సందర్శించి, తొలుత తరగతుల వారీగా వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలను అంచనావేశారు. అనంతరం జగనన్న గోరుముద్ద పథకం కింద విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంను పరిశీలించి, పలు సూచనలు చేశారు. నాణ్యమైన విద్య, భోజనం విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బొబ్బిలి / రాజాం
9951602891, 9010133309
Office mail : vzmadvt@gmail.com